క్లుప్తంగా

ఘనంగా రథోత్సవం



రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లో శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఆశీనులను చేసి పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం అమ్మవారిశాల వీధి, మెయిన్ బజార్, పప్పుల బజార్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. దారి వెంబడి భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు.

లాసెట్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిరణ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జేవీవీ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం లాసెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిరణ్ మాట్లాడుతూ దేశ ప్రజలకు రాజ్యాంగమే అత్యున్నతమైందని, రచనలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలిపారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జూన్ 5వతేదీ వరకు లాసెట్ పరీక్షకు సంబంధించి లా అప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ పట్ల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిపుణులు రవి, రాజు, రమణ, హరిత బోధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లా స్టూడెంట్స్ రాష్ట్ర కన్వీనర్ అహ్మద్, జేవీవీ నాయకులు సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

ట్రంప్ జోక్యం విదేశాంగ విధానానికి విరుద్ధం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

మైదుకూరు : ఉగ్రవాదుల అంతం కోసం మన దేశం చేపట్టిన చర్యల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడం మన విదేశాంగ విధానానికి విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మైదుకూరులో పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదుల చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు మత విభజన రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆర్థిక, పారిశ్రామిక, ఉపాధి విధానాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమావేశంలో సీపీఎం మండల అధ్యక్షుడు షరీఫ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అన్వేష్, చాంద్ బాషా, గురయ్య, రవి, లక్ష్మయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య తెలిపారు. కడప ఆపస్ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల అసంబద్ధంగా జారీ చేసిన 19, 20, 21వ జీవోలు రద్దు చేయాలని, ఇంగ్లిష్ మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:20గా, ఉన్నత పాఠశాలల్లో 1:30 గా ఉంచాలనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చిన 17 సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోగుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గత 30 వారాలుగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉపాధ్యాయ సంఘాల నేతలను సమావేశపరిచి అభిప్రాయాలు తీసుకుని ఒక దానిని అమలు చేయక పోవడం దారుణం అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పోరాటం చేసి విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం కార్యకర్త వ్యక్తిగత బాధ్యత తీసుకొని వేలాది మంది ఉపాధ్యాయులతో ఈ నెల 21న జరిగే ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



శిక్షణ శిబిరంలో మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థులు



తైక్వాండోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వేసవి శిక్షణ శిబిరాలపై విద్యార్థుల మొగ్గు

బద్వేల్ అర్బన్ : వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే దిశగా విద్యార్థులు ముందడుగు వేస్తున్నారు. వివిధ రకాల క్రీడా శిక్షణా శిబిరాలలో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని కొత్త మెలకువలు నేర్చుకుంటున్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో తైక్వాండో, కోట వీధిలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాలు విద్యార్థులతో సందడిగా మారాయి. తైక్వాండో అకాడమీ కోచ్ వెంకటసుబ్బయ్య ఇస్తున్న శిక్షణలో 40 మంది బాల, బాలికలు పాల్గొంటూ మెలకువలు నేర్చుకుంటున్నారు. కోటవీధి ఎస్ఆర్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో కోచ్ కోనేటి సుధీర్ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో వంద మందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. సీనియర్ కోచ్‌లు ఆకులరమణ, సింగసానిశివకుమార్‌ల సహకారంతో విద్యార్థులకు డ్రైవ్స్, డిఫెన్స్, బౌలింగ్, ఫీల్డింగ్‌లలో శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్నా. ఆసక్తి గల విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు మంచి క్రీడాకారులుగా ఎదిగారు. దాతల సహకారం కూడా తోడైతే మరింత బాగుంటుంది.

- కె.సుధీర్, క్రికెట్ కోచ్

బాలికలకు ఉపయోగం



ప్రస్తుతం బాలికలపై రోజురోజుకూ జరగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో చిన్నతనం నుంచే ఆత్మరక్షణ క్రీడ తైక్వాండో నేర్చుకోవడం మంచిది. బాలికలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడంతో పాటు వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నా.

- వెంకటసుబ్బయ్య, తైక్వాండో మాస్టర్

శిక్షణ బాగా ఉపయోగపడుతోంది



చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్‌లో రాణించాలన్నదే నా ఆశయం. ఇక్కడ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో మంచి మెలకువలు నేర్పిస్తున్నారు. అన్నీ నేర్చుకుని క్రికెట్‌లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎదగడమే నా లక్ష్యం.

- ఎం.రిషి, క్రికెట్ క్రీడాకారుడు

గోమాత సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రొద్దుటూరు : వీధుల్లో పారవేసే ప్లాస్టిక్ కవర్లు వంటి వ్యర్థాలను తినడం వల్ల గోవులు మృత్యువాత పడుతున్నాయని, గోమాత సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాములపేట నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం గోవులకు ఆయన ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, కాయలు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టం అమలు చేయాలని కోరారు. గోవులు పాలు ఇచ్చినన్ని రోజులు సంరక్షించి అవి ఒట్టిపోగానే వీధుల్లోకి వాటి యజమానులు వదులుతున్నారన్నారు. అలా వదలకుండా గోశాలలో చేర్చాలని తెలిపారు. గోమాతను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గో ప్రేమికులు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పరమేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, మోహన్, వేమనారాయణ యాదవ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



గోవులకు పండ్లు, కాయలు తినిపిస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

• కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఆర్‌టీ డాక్టర్ సూర్యనాగలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం : అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ సూర్యనాగలక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనలో హెచ్‌ఐవీ బాధితులకు అందించే సేవలు ఎంతో ప్రాముఖ్యాన్నిస్తా యని చెప్పారు. హెచ్‌ఐవీ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వం అందించే సేవలను, వాటి ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని చెప్పారు. జిల్లా ఆస్పత్రి నుంచి గవిని సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శివశంకరయ్య, ఐసీటీసీ, ఏఆర్‌టీ కౌన్సిలర్లు గంగిరెడ్డి, చంద్రలీల, వినయ్ బాబు, రేవతికుమార్, సిబ్బంది సాధిక్‌బాషా, గోవిందరెడ్డి, సునీత, మహేశ్వరి, లక్ష్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్, పుల్లయ్య చైల్డ్ ఫండ్ ఇండియా, షేర్ ఇండియా సిబ్బంది, టీబీ సిబ్బంది హుస్సేన్ బాషా, రఫియా, నాగేశ్వరి పాల్గొన్నారు.

• తిరంగా ర్యాలీ




చాపాడులో తిరంగా ర్యాలీలో నిర్వహిస్తున్న నాయకులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం కూటమి పార్టీల నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల నివాసాలను భారత సైన్యం తుదిముట్టించారని బీజేపీ మండల అధ్యక్షుడు చిన్న గోపాల్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో కూడా ఉగ్రవాదులు లేకుండా చేసేందుకు ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, నాయకులు నారపురెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాము, గుండు వీరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమం కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) బాధ్యులతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బ్రహ్మశ్రీ అవధాని మాజీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు మాడుగుల నాగఫణి శర్మలను ఆయన కలిసి తెలుగు భాషోపాధ్యాయుల సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తెలుగు మాధ్యమం కోసం ఎన్నో పోరాటాలు చేశామని, కూటమి ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని కొనసాగించడంలో గత ప్రభుత్వ మార్గాన్ని అనుసరిస్తోందని తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గారితో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగా గంగాధర్, మద్దిలేటి, జి.వేణుగోపాల్, సహదేవారెడ్డి, మురళి, వెంకటరమణ, మధు, రవిశంకర్, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఉప రాష్ట్రపతికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులురెడ్డి, తదితరులు

అసంబద్ధ విధానాలతో భవిష్యత్తే ఉండదు

ప్రొద్దుటూరు : విద్యావ్యవస్థలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలతో మన బడులకు, మనకు భవిష్యత్తే ఉండదని ఎస్‌టీయూ(డీ) రాష్ట్ర అధ్యక్షుడు రావుల సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ సంస్కరణల పేరుతో 19, 210, 211 జీఓల ద్వారా సంఘాల సలహాలను పాటించకుండా అసంబంద్ద విధానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధ్యాయుల విద్యార్థిల నిష్పత్తి ఫౌండేషన్ పాఠశాలలో 1:30, బేసిక్ పాఠశాలలో 1:20, మోడల్ స్కూల్‌లో 1:10 అంటూ పాఠశాల, పాఠశాలకు వ్యత్యాసం చూపడం సరైనది కాదని తెలిపారు. అన్నిటికి ఒకే విధానాన్ని పాటించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలో 53పైన విద్యార్థులుంటే అదనపు సెక్షన్ అంటున్నారని, దీని వల్ల స్కూల్ అసిస్టెంట్ల మిగులు ఏర్పడుతుందని, కావున 45 పైన అదనపు సెక్షన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియం తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రైమరీ పాఠశాలలకు ఎస్‌జీటీలనే హెచ్‌ఎంలుగా నియమించాలని, పీహెచ్‌సీల వారికి, రేషనలైజేషన్ వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ శాఖలు, విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. కడప జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. 2023లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులపై దృష్టి పెట్టి ఉద్యోగాల భర్తీ చేపట్టిందన్నారు. ఆ తర్వాత ఇప్పటిదాకా ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రభాకర్, రమేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు

కడప రూరల్: వేడుకలా మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కడప నగరానికి సమీపంలో నిర్వహిస్తున్న మహానాడు ప్రాంగణ స్థలాన్ని మంత్రులు, ఆ పార్టీ నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహానాడు కడపలోనే నిర్వహించాలనే సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా 145 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27, 28వ తేదీన 23 వేల మంది ప్రతినిధులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 29న భారీ బహిరంగ సభ ఉంటుందని, దాదాపు 5 లక్షల మందికిపైగా ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు సవిత, అనిత, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు పయ్యావుల కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

చదువుల తర్వాత రైతులకు సేవలందించాలి

కడప అగ్రికల్చర్: ఉన్నత చదువులు పూర్తయిన తర్వాత రైతులకు సేవచేయడంతోపాటు, తమ తల్లిదండ్రులకు మంచి చేయాలని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ అన్నారు. కడప నగర శివారులోని తాడిగోట్ల గ్రామంలో తిరుపతి వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేపట్టిన జాతీయ సేవా పథకం కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ అభివద్ధికి విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇన్‌ఛార్జి డాక్టర్ పాండురంగ(కీటక విభాగ శాస్త్రవేత్త) మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిపై సర్వే, మొక్కలు నాటడం, పరిసరాలు శుభ్రంచేయడం, ఉచిత వైద్య శిబిరం, కార్యక్రమాలు నిర్వహించాని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంకయ్యకుమార్

నేడు విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆదివారం నలసాలమ్మ, పోతురాజు, నాగదేవత, గోపుర ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా మారెమ్మ తల్లి విగ్రహప్రతిష్ట

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్



మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డిలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖాజీపేట : మండలంలోని నాగసానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సెవాల్ మహరాజ్, మారెమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డి హాజరయ్యారు. నాగసానిపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌కు స్వాగతం పలికారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆశీర్వాదం అందించారు. అనంతరం కమిటీ సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడే ఆలయ నిర్మాణానికి ఎండోమెంట్ ద్వారా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రూ.10లక్షల సహాయం అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి, కొత్తపేట నాయకుడు శెట్టిపల్లి సిద్దారెడ్డి, రామకృష్ణారెడ్డి, నక్కా సుధాకర్ యాదవ్, ఓబయ్య యాదవ్, మూడే శ్రీనివాసులనాయక్, బుక్కే నాగార్జున నాయక్, మేడే నరసింహనాయక్, రాంజానాయక్, మల్లికార్జుననాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి మాత హోమం



హోమం చేస్తున్న ఆర్యవైశ్య సుహాసినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మూడో రోజున ఆదివారం వారాహి దేవి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవీ మాతకు విశేష పూజలు నిర్వహించి అలంకరించారు. శ్రీశక్తి పీఠం పీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతి స్వామి ఆధ్వర్యంలో 102 మంది ఆర్యవైశ్య సుహాసినులచే కలశ పూజ, గణపతి పూజ, వారాహి మాత హోమం నిర్వహించారు. పూర్ణాహుతి, మహానివేదన, మహా మంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా పుణ్య ఫలాలు, శత్రు నివారణ, విజయం, ధైర్యం, శక్తి కలుగునని రమ్యానందభారతి భక్తులకు వివరించారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రమ్యానంద భారతి స్వామిని ఆర్యవైశ్య సభ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం, కోశాధికారి మిట్టా శంకర్, భక్తులు పాల్గొన్నారు.

• వైభవంగా జాతర మహోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బద్వేలు అర్బన్ : మండలంలోని గొడుగునూరు గ్రామంలో పోలేరమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి ఆహ్వానం మేరకు జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాలరామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎన్.విశ్వనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. వారితోపాటు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గురుమోహన్, రామసుబ్బారెడ్డి, యద్దారెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాయి క్రిష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• పోలేరమ్మ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న భాస్కర్‌రెడ్డి

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో పోలేరమ్మ శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి హాజరై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆహ్వానం మేరకు హాజరైన నాయకులను గ్రామస్థులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

• పెద్దమ్మ జాతరలో రాచమల్లు



వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిలో మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : కామనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నక్కలదిన్నె గ్రామంలో జరిగిన పెద్దమ్మతల్లి జాతర కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆహ్వానం మేరకు జాతరకు వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే యాదవుల అభివృద్ధి



రామచంద్ర యాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఐక్యతతోనే యాదవుల అభివృద్ధి సాధ్యమని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ తెలిపారు. స్థానిక శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. యాదవులు ఐక్యతతో ముందుకెళ్లినప్పుడు ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. శ్రీకృష్ణాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం బోడె రామచంద్ర యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి రాచగొళ్ల వెంకటరమణ యాదవ్, కోశాధికారి రామబోయిన వెంకటయ్య యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నందలూరు : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా – ఉపాధి కల్పన వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో మంగళవారం ఆకేపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.